క్లుప్తంగా

ఎంపీపీ, ఎంపీటీసీల వేతనాలు చెల్లించాలి

ఇబ్రహీంపట్నం: ఎంపీపీ, ఎంపీటీసీల పదవీకాలం జూలై 4వ తేదీతో ముగుస్తుందని, ఏడు నెలల గౌరవ వేతం వెంటనే వేతనాలు చెల్లించాలని ఎంపీపీ జాజాల భీమేశ్వరి డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మాట్లాడారు. గతేడాది డిసెంబర్ నుంచి జూన్ వరకు ఎంపీటీసీలకు ఒక్కొక్కరికి నెలకు రూ.ఆరువేల చొప్పున రూ.42వేలు, ఎంపీపీకి నెలకు రూ.13వేల చొప్పున రూ.91 వేల వేతనాలు రావాల్సి ఉందన్నారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి స్పందించాలని కోరారు.

స్వయం ఉపాధి కల్పనకు కుట్టుశిక్షణ కేంద్రం


సర్టిఫికెట్లు అందుకున్న మహిళలతో క్లబ్ సభ్యులు

మెట్‌పల్లి: మహిళలకు స్వయం ఉపాధి కల్పించడానికి ఉచిత కుట్టుశిక్షణ కేంద్రం ఏర్పాటు చేశామని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు దొంతుల ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు గురువారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. 200 మంది మహిళలకు శిక్షణ ఇచ్చామని, రానున్న రోజుల్లో కేంద్రాన్ని కొనసాగిస్తామని, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శివ శ్రీనివాస్, గంగుల మురళి, వడ్డెపల్లి శ్రీనివాస్, ఇల్లెందుల శ్రీనివాస్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

మత్తడి నీరు మళ్లించాలని కమిషనర్‌కు వినతి


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న వార్డు ప్రజలు

కోరుట్ల: పట్టణ శివారులోని మద్దుల చెరువు, కంచెర కుంట మత్తడి నీటిని వేరే వైపునకు మళ్లించాలని 9, 10వ వార్డులకు చెందిన పలువురు మున్సిపల్ కమిషనర్‌కు గురువారం వినతిపత్రం సమర్పించారు. వర్షాకాలంలో అలుగుపారుతుండటంతో వరద నీరు వార్డుల్లోకి వస్తోందని, చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, కనీసం తాత్కాలిక చర్యలు కూడా చేపట్టలేదని వివరించారు. మత్తడి నీరు మళ్లించకుంటే నిరసనలు చేపడతామని వినతిపత్రంలో పేర్కొన్నారు.

భూకబ్జా చేసినవారిపై చర్యలు తీసుకుంటాం


సర్వేచేస్తున్న అధికారులు

రాయికల్: మండలంలోని సింగరావుపేట గ్రామంలో తాళ్లచెరువు ఆక్రమణకు గురవుతుందని హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ముఖ్యమంత్రికి ఇటిక్యాల గ్రామానికి చెందిన సుంకిసాల సత్తయ్య ఫిర్యాదు చేశారు. గురువారం ఆర్‌ఐ దేవదాస్, సర్వేయర్ రాజు, ఇరిగేషన్ ఏఈ ధనుంజయ్ చెరువు హద్దులు నిర్ణయించి ఆక్రమణకు పాల్పడినవారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

గొర్రెలు, మేకల సర్వే


వివరాలు సేకరిస్తున్న వెటర్నరీ ఆఫీసర్

జగిత్యాలరూరల్: జిల్లా పశుసంవర్ధకశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్, ధర్మారం గ్రామాల్లో గొర్రెలు, మేకల సమగ్ర సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్ కందుకూరి పూర్ణచందర్, గొల్లకుర్మ యాదవ రైతులు పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరా బంద్



ధర్మపురి: పట్టణంలో శుక్రవారం నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. జగిత్యాలలో మిషన్ భగీరథ పైపులైను లీకేజీతో పట్టణ పరిధిలో మొత్తం నీటి సరఫరా బంద్ చేస్తున్నామని ఒక్కరోజు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ప్రజలు సహకరించాలని కోరారు.

గుంతలతో ప్రయాణికుల తంటాలు



కోరుట్లటౌన్: పట్టణంలోని కటికె వాడ నుంచి బురుజు కూరగాయల మార్కెట్‌కు వెళ్లే సీసీరోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. రోడ్డుపై గుంతలు ఏర్పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చివేయించాలని ప్రజలు కోరుతున్నారు.

మూతపడిన వాటర్ ప్లాంట్



కథలాపూర్: మండలంలోని తక్కళ్లపెల్లి గ్రామంలో ఓ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన మినరల్ వాటర్‌ప్లాంట్ ఐదారు నెలలుగా మూతపడటంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందిపడుతున్నారు. ప్లాంట్‌లోని మిషన్లకు మరమ్మతులు చేయించడంలేదు. ఇదే అదునుగా ప్రైవేట్ వాటర్‌ప్లాంట్ నిర్వాహకులు అధిక ధరకు వాటర్ విక్రయిస్తున్నారని గ్రామస్తులు వాపోయారు. ప్లాంట్‌ను అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

విద్యా, ఉద్యోగాల కల్పనకు కృషి

- అభివృద్ధి, సంక్షేమానికి కొట్లాడుతా
- మల్లాపూర్‌లో మండల సభలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్



మల్లాపూర్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

మల్లాపూర్: కోరుట్ల నియోజకవర్గంలో విద్యా, ఉద్యోగాల కల్పనకు నిరంతరం కృషిచేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎంపీపీ కాటిపెల్లి సరోజన అధ్యక్షతన చివరి సర్వసభ్య సమావేశం నిర్వహించగా ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలు, రైతులు స్వర్ణయుగం చూశారని, కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కేసీఆర్ పరిపాలన అందించారని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మోసపూరిత హామీలు, వాగ్దానాలను నమ్మి ప్రజలు అధికారమిస్తే ఆరునెలల్లోపే అన్నివర్గాల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. విలువలకు పాతరేసి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను పార్టీలో అనైతికంగా చేర్చుకుంటున్నారని, రాజకీయాల్లో ఉన్నంత వరకు నీతిగా నిలబడి కొట్లాడుతా, ప్రజల నమ్మకం వమ్ముచేయనని, వంచన, ఒత్తిళ్లకు లొంగే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని, అభివృద్ధి పనుల్లో అందరూ కలిసికట్టుగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు కాటిపెల్లి సరోజన, వైస్ ఎంపీపీ గౌరు నాగేష్, ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి, ఎంపీవో జగదీష్, ప్యాక్స్ చైర్మన్ బద్దం అంజిరెడ్డి, మండల కో–ఆప్షన్ సభ్యుడు ఎం.ఎ.సత్తార్, ఎంపీటీసీలు, పలుశాఖల డిప్యూటీ ఈఈలు, ఏఈలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



రాయికల్: బీఆర్‌ఎస్‌కు రాయికల్ మండల కో–ఆప్షన్ మెంబర్ ముకీద్ గురువారం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సమక్షంలో హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఎమ్మెల్యే నివాసంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ వెంటే మేమంతా నడుస్తామని అన్నారు.

ఇబ్రహీంపట్నం డిప్యూటీ తహసీల్దార్‌గా ప్రసాద్



ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం డిప్యూటీ తహసీల్దార్‌గా కె. ప్రసాద్ గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేసిన డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్ జగిత్యాల కలెక్టరేట్‌కు డిప్యూటేషన్‌పై వెళ్లారు. కలెక్టరేట్ కార్యాలయం ఎన్నికల విభాగం నుంచి డీటీగా ప్రసాద్ ఇబ్రహీంపట్నం వచ్చారు. ఈసందర్భంగా సిబ్బంది ప్రసాద్‌కు స్వాగతం పలికారు.

బాధ్యతలు సక్రమంగా నిర్వహించాలి


అమ్మ ఆదర్శ పాఠశాలలో అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ స్వాతి

మల్యాల: బాధ్యతలు సక్రమంగా నిర్వహించాలని, పనులు సకాలంలో పూర్తిచేయాలని ఎంపీడీఓ స్వాతి అన్నారు. మండలంలోని రామన్నపేట, నూకపల్లి గ్రామాల్లో గురువారం అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులతోపాటు నర్సరీలను పరిశీలించారు. ప్లాంటేషన్ పనులు ప్రారంభించాలని ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. నూకపల్లి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులతో వివిధ సబ్జెక్టులపై ముచ్చటించారు. విద్యార్థులందరూ నిత్యం పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని ఉపాధ్యాయులకు కోరారు. నూకపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి, బాలింతలు, గర్భిణులకు సరుకులు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వెంట కార్యదర్శి రాధ, చంద్రయ్య, లావణ్య, గంగమల్లు తదితరులు ఉన్నారు.

లయన్స్ క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

కోరుట్ల: పట్టణంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం బుధవారం రాత్రి నిర్వహించారు. అధ్యక్షుడిగా కుందారపు మహేందర్, సెక్రెటరీగా శ్రీగద్దె నరేంద్ర, ట్రెజరర్‌గా కొమ్ముల జగపతి ప్రమాణ స్వీకారం చేశారు. మహిళా క్లబ్ అధ్యక్షురాలిగా పోతని శ్రీలత, సెక్రెటరీగా పాలాస గీతారాణి, ట్రెజరర్‌గా మంచాల రోజా రమణి ప్రమాణం చేశారు. జిల్లా మాజీ గవర్నర్ చిదుర సురేష్ కార్యవర్గంతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో మాజీ గవర్నర్ రేకుల విజయ, డీసీఎస్ వాలేటి శ్రీనివాసరావు, డీసీజేఎస్ జయప్రకాష్, జీఈటి సేగంటి నరేష్, ప్రస్తుత అధ్యక్షుడు వనపర్తి చంద్రమోహన్, ట్రెజరర్ కృష్ణ ప్రసాద్, మహిళా అధ్యక్షురాలు రమ్య, ట్రెజరర్ రాధిక, కార్యదర్శి ప్రేమలత, సభ్యులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

ధర్మపురి: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌తో పాటు క్యాష్‌బ్యాగ్‌ను దేవస్థానం సిబ్బంది బాధితులకు అప్పగించారు. ఎల్లారెడ్డి మండలానికి చెందిన యెన్నం జనార్దన్‌రెడ్డిసుజాత గురువారం లక్ష్మీనృసింహుడిని దర్శించుకోవడానికి వచ్చారు. దేవస్థానం ఆవరణలో సెల్‌ఫోన్, క్యాష్‌బ్యాగును పోగొట్టుకోగా దేవస్థానం సిబ్బంది పెండ్యాల గణేశ్‌కు దొరకడంతో వెంటనే ఈవో శ్రీనివాస్‌కు అందజేశారు. అనంతరం ఈవోకు భక్తులకు ఇవ్వగా వారు కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

● సెలవులో మున్సిపల్ ఉద్యోగి

జగిత్యాల: జగిత్యాల మున్సిపాలిటీలో శానిటేషన్‌లో పనిచేస్తున్న ఓ ఉద్యోగిపై మెట్‌పల్లిలో కేసు నమోదైంది. దీంతో ఆయన సెలవుపై వెళ్లాడు. ఆయనకు మున్సిపల్ కమిషనర్ చిరంజీవి నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది.

● ఇంటి గోడ వివాదంలో ఇద్దరికి గాయాలు

మల్యాల(చొప్పదండి): ఇంటి గోడ విషయంలో ఇరువర్గాలు కర్రలు, పారలతో దాడి చేసుకోగా.. ఇద్దరి తలలు పగిలిపోయాయి. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు. మల్యాల ఎస్సై కుమారస్వామి కథనం ప్రకారం.. మండలంలోని ఒబులాపూర్ ఎస్సీ కాలనీలో ఓ ఇంటి గోడ విషయంలో ఇరువర్గాల మధ్య వివాదం ఏర్పడింది. ఇరువర్గాలు పారలు, కర్రలతో దాడులకు దిగడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. బడుగు రాజయ్య, బడుగు లచ్చయ్య, బడుగు విఘ్నేష్, బడుగు సుమలత తమ ఇంట్లోకి చొరబడి కర్రలతో దాడి చేశారని తొర్తి రాజయ్య ఫిర్యాదు చేశాడు. అలాగే తొర్తి రాజయ్య, తొర్తి శేఖర్, తొర్తి నవీన్ తమపై దాడి చేశారని బడుగు లచ్చయ్య, విఘ్నేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

● బీఆర్‌ఎస్‌కు రాజీనామా

రాయికల్: రాయికల్ మార్కెట్ కమిటీమాజీ చైర్మన్ మైతాపూర్‌కు చెందిన గన్నె రాజిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ గురువారం పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరనున్నామని తెలిపారు. మండలంలోని ముఖ్య నాయకులంతా రాజీనామా చేసి సంజయ్‌కుమార్‌కు మద్దతుగా కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు సమాచారం.

● వ్యవసాయ అధికారులకు వినతి

మెట్‌పల్లిరూరల్: సన్నరకం వడ్ల విత్తనాల విషయంలో రైతులు అయోమయానికి గురవుతున్నారని మెట్‌పల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి అన్నారు. మెట్‌పల్లి వ్యవసాయశాఖ కార్యాలయంలోని అధికారులకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఎలాంటి విత్తనాలు వేస్తే రైతులకు ప్రయోజనం చేకూరుతుందనేదానిపై రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. లేదంటే రైతులు నష్టపోయే అవకాశం ఉందన్నారు.

● మిషన్ భగీరథ సర్వే పూర్తి

పెగడపల్లి: మండలంలో మిషన్ భగీరథ పథకం అమలుపై చేపట్టిన సమగ్ర సర్వే పూర్తయినట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో మహేందర్ గురువారం తెలిపారు. మండలంలోని 23 గ్రామాల్లోని 10681 కుటుంబాలు ఉండగా ప్రతి ఇంటిని సందర్శించి కుళాయిల పరిశీలనతో పాటు ఇంటి యజమాని వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశామన్నారు. కొత్త పైపులైన్, కుళాయిల కనెక్షన్లు, సమస్యలు ఉన్న ప్రాంతాలను గుర్తించి అధికారులను నివేదించామన్నారు.

● ఎంపీ ఒవైసీ క్షమాపణ చెప్పాలి

పెగడపల్లి: ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరించిన హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ క్షమాపణ చెప్పాలని బీజేపీ నాయకులు గురువారం ప్రకటనలో డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో ఎంపీగా ప్రమాణ స్వీకారం అనంతరం జై పాలస్తీనా అంటూ నినదించడం సరికాదని, ఒవైసీని ఎంపీ పదవికి అనర్హుడిగా ప్రకటించాలంటూ బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మర్రిపల్లి సత్యం, మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పల్లె మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

● డ్రగ్స్ అనర్థాలపై విద్యార్థులకు అవగాహన

కోరుట్లరూరల్: పట్టణంలోని లిటిల్ జీనియస్ హైస్కూల్‌లో గురువారం డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలను ఉపాధ్యాయులు, హెల్త్ ఎడ్యుకేటర్ కటుకం శంకర్ విద్యార్థులకు వివరించారు. మత్తుపదార్థాలు, చెడు వ్యసనాలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్ రహిత భారత్ కోసం శ్రమిస్తామని ఎన్‌సీసీ విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ బండి మహదేవ్, ప్రిన్సిపాల్స్ రాధాకృష్ణ, వినోత, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై దృష్టి సారించాలి


ఇప్పపెల్లిలో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న ఎంపీవో ప్రవీణ్

కథలాపూర్: గ్రామాల్లో పారిశుధ్య పనులపై కార్యదర్శులు దృష్టిసారించాలని ఎంపీవో ప్రవీణ్ అన్నారు. గురువారం మండలంలోని ఇప్పపెల్లి, పోతారం గ్రామాల్లో డ్రైనేజీలను పరిశీలించారు. చెత్త పేరుకుపోకుండా చూడాలని, దోమల నివారణ మందులు పిచికారీ చేయించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి నిత్యావసర వస్తువుల రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట కార్యదర్శులు శేఖర్, కిషన్ ఉన్నారు.


పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచిస్తున్న అధికారులు

మెట్‌పల్లిరూరల్: మండలంలోని ఆత్మనగర్‌లో డ్రైడేలో భాగంగా గురువారం పారిశుధ్య చర్యలు చేపట్టారు. డ్రైనేజీలు, రహదారులను శుభ్రం చేయడంతో పాటు పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. ఇంటింటికీ తిరుగుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి నిజాముద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామదేవతల విగ్రహ పునఃప్రతిష్ఠాపన


మంగళహారతులు,బోనంతో వెళ్తున్న గ్రామస్తులు

మెట్‌పల్లిరూరల్: మండలంలోని సత్తక్కపల్లిలో గురువారం గ్రామదేవతల విగ్రహ పునఃప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. డప్పుచప్పుళ్ల మధ్య దేవతల విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమానికి గ్రామస్తులు భారీగా తరలిరాగా పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, కుల సంఘాలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


ధర్మపురి: గిరిజన వసతి గృహంలో ప్రీస్కూల్ శిక్షణ తరగతుల్లో అంగన్‌వాడీ టీచర్లు

పెగడపల్లి: పౌష్టికాహారంతోనే పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మహేశ్వరి, సుభద్ర అన్నారు. మండలంలోని ఆరవెల్లి, పెగడపల్లి తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం గ్రోత్ డే కార్యక్రమంలో భాగంగా చిన్నారుల బరువు, ఎత్తు జబ్బల కొలతలు చూశారు. పోషకాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించి సమతుల ఆహారం ఇవ్వాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు, బాలంతలు, గర్భిణులు పాల్గొన్నారు.

ప్రీస్కూల్ శిక్షణ తరగతులు

ధర్మపురి: పిల్లల సమగ్ర అభివృద్ధితో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లల ఆహార అలవాట్లు, ఆరోగ్య పరిస్థితులపై టీచర్లకు రివైజుడ్ ప్రీస్కూల్ శిక్షణ తరగతులను ప్రభుత్వవిప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సతీమణి కాంతకుమారి, డీడబ్ల్యూవో వాణిశ్రీ గురువారం ప్రారంభించారు. మండలంలోని అంగన్‌వాడీ టీచర్లకు స్థానిక గిరిజన వసతి గృహంలో మూడు రోజులు శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. విద్యాతో పాటు పిల్లలు తీసుకునే పౌష్టికాహారం, పిల్లల ఎదుగుదల స్కూలు వాతావరణం వివరించారు. అనంతరం పిల్లలకు పుస్తకాలను పంపిణీ చేశారు. సూపర్‌వైజర్లు కుసుమ, ఆండాలు, శైలజ, లత, నీలిమ మాస్టర్ ఫైనాన్స్ పవిత్ర, రాధిక, సుధా, ఉమా పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ మధు, బ్లాక్ కోఆర్డినేటర్ ప్రణీత తదితరులున్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్య బృందం

లింగ నిర్ధారణ నేరం

- మహిళా సాధికారత కో–ఆర్డినేటర్ అశ్విని

జగిత్యాల: లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని మహిళ సాధికారత కో–ఆర్డినేటర్ అశ్విని అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కావ్యశ్రీ నర్సింగ్‌హోమ్‌తో పాటు పలు డయాగ్నొస్టిక్ సెంటర్లలో గర్భిణులకు మహిళా సాధికారత ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఆడపిల్ల అని తెలియగానే తొలగించుకోవాలనుకుంటున్నారని, లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్ కనకదుర్గ, జిల్లా కో–ఆర్డినేటర్ గౌతమి, స్వప్న, హేమశ్రీ పాల్గొన్నారు.

నిర్మాణాల పరిశీలన


మద్దుల చెరువు వద్ద నిర్మాణాలను పరిశీలిస్తున్న కమిషనర్ తిరుపతి, అధికారులు

కోరుట్ల: పట్టణ శివారులోని మద్దుల చెరువు, తాళ్ల చెరువు, కంచరి కుంట ప్రాంతంలో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లోని నిర్మాణాలను మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి గురువారం పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాలతో వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని, పారిశుధ్యం, మురుగునీటి నిల్వల తొలగింపు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కమిషనర్ తెలిపారు. అనంతరం పారిశుధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ


పుస్తకాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఫ్రెండ్స్ వెల్ఫేర్ ట్రస్ట్ సభ్యులు

మల్లాపూర్: విద్యార్థులు లక్ష్యంతో చదివితే విజయం సాధ్యమవుతుందని ఫ్రెండ్స్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షుడు సుర్గి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండలంలోని హుస్సేన్‌నగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోని నిరుపేద విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ చేయడం అభినందనీయం, ట్రస్ట్ సేవలు ఆదర్శనీయమని పాఠశాల ఉపాధ్యాయులు కొనియాడారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పిప్పెర నరేష్, సతీష్, రెడ్డి, రవిరెడ్డి, సన్నీ, రవితేజ తదితరులు పాల్గొన్నారు.